# అక్టోబరు విప్లవం నుండి నేర్చుకొందాం

**అక్టోబరు –** ప్రపంచ వ్యాపితంగా శ్రామిక వర్గం, పీడిత జాతులు, ప్రజలు స్మరించుకోవలసిన, వేడుక చేసుకోవలసిన మహత్తరమైన నెల. ఎందుకంటే, 93 ఏళ్ల క్రితం ఈ నెలలో, ఎల్లకాలం 'పాలితులు'గా వుండడానికి మాత్రమే అర్హులుగా భావించబడిన పీడిత జనబాహుళ్యం కార్మికవర్గ నాయకత్వంలో దోపిడీ వర్గాల స్వర్గధామంపై దాడి చేశారు. వారి అధికారాన్ని కూలద్రోశారు. ఇక్కడ మనం 1917 నాటి మహత్తర అక్టోబరు రష్యా సోషలిస్టు విప్లవం గురించి చెప్పుకొంటున్నాము.

అక్టోబరు విప్లవం అభివృద్ధి నిరోధక, విప్లవ ప్రతీఘాతుక వర్గాలకు, శక్తులకు ఒక భయానక దుస్వప్నం. అక్టోబరు విప్లవాన్ని గుర్తుచేసుకొంటూ ఎప్పుడూ నిజం కాలేని కలల్లో మునిగిపోకండి అంటూ కమ్యూనిస్టులకు, కార్మికవర్గానికి, పీడిత ప్రజలకు సలహాలివ్వడానికి వారు కొన్ని సమయాల్లో సాహసిస్తారు. ఇలా చేయడంలో వారు తమకు తామే ధైర్యం చెప్పుకొంటున్నారు. అదే సమయంలో, సోషలిజానికి, కమ్యూనిజానికి నూకలు చెల్లాయని వారు డంబాలు చెప్పుకొంటున్నప్పటికీ ఆ 'భూతం' యింకా వారి చుట్టూ ఆవరించి వుందని వారికి బాగా తెలుసు. చరిత్రకు అంతం అని తాము ప్రకటించుకొన్న ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు కోలుకోలేని, క్యాన్సరు లాంటి జబ్బులతో – వైరుధ్యాలు, సంక్షోభాలతో మూలుగుతున్నాయనీ, అవి పదేపదే రోజూ బహిర్గతమవుతున్నాయనీ వారికి బాగా తెలుసు. తాము అనేక రూపాల్లో తీవ్రతరం చేస్తున్న, విస్తరిస్తున్న దోపిడీ పీడనలు ప్రజల మధ్య అసంతృప్తి, నిరసన, తిరుగుబాటు విత్తనాలు నాటుతున్నాయని వారికి బాగా తెలుసు. సోషలిస్టు, ప్రగతిశీల భావాలు, శక్తులు బలంగా పెరగడానికి, ప్రజల మధ్య లోతుగా వేళ్లూనడానికి అవసరమైన ఎరువు, నీరు అందిస్తున్నది కూడా వారే. మారణాయుధాలపైన, నిర్బంధ యంత్రాంగంపైన, అవినీతి, దూషణలపాలుచేసే సాధనాలపైన లక్షల, కోట్ల డాలర్లు, రూపాయిలు వెచ్చిస్తున్నారంటే, అది దోపిడీ వర్గాలు, సామ్రాజ్యవాదులు, వారు పరిరక్షించ జూస్తున్న వ్యవస్థలు ఎంతగా బలహీన, భద్రతారహిత, భయానక స్థితిలో వున్నాయో తెలియజేస్తుంది.

కమ్యూనిస్టులకు, పీడిత జాతులకు, ప్రజలకు సంబంధించినంత వరకు అక్టోబరు సోషలిస్టు విప్లవం గతించిపోయిన విషయం కాదు. కల మాత్రమే కాదు. మానవ చరిత్ర సాధించిన చారిత్రక ప్రాధాన్యత గల ఒక గొప్ప విజయం. నేటి విప్లవాలకు మార్గదర్శి, మనకిది విప్లవానుభవాల తరగని గని. ఈ గనిని నిరంతరం లోతుగా త్రవ్వడం, యిది అందించే సుసంపన్న గుణపాఠాలతో సాయుధం కావడం, వాటి సాయంతో పొరపాట్లను నివారించడం, ఈనాటి విప్లవోద్యమాన్ని సరైన దిశలో నడిపించడం మన కర్తవ్యం.

1871లో వచ్చిన పారిస్ విప్లవం మానవ చరిత్రలోనే తొలిరకం విప్లవం. శ్రామికవర్గం విప్లవాన్ని విజయవంతంగా నడపడం మాత్రమే కాదు. 71 రోజులు అధికారం చేసింది. సోషలిస్టు సంస్కరణలను కూడా ప్రవేశపెట్టింది. పారిస్‌కమ్యూన్ పతనం దాని బలహీనతలను, కొరవలను బయట పెట్టుకొన్నది. దానితోపాటు, శ్రామికవర్గం బూర్జువా వర్గాన్ని కూలద్రోయడం అన్నది బూర్జువావర్గం వ్యాపింపజేసిన అనేక బూటకాలను పటాపంచలు చేసింది. శ్రామికవర్గం విప్లవాన్ని నడపడమేకాదు పాలించగలదు కూడా అని ఆచరణలో బలంగా నిరూపించింది.

1871 విప్లవం శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత కర్తలైన మార్క్స్, ఏంగెల్స్‌లు జీవించివున్న కాలంలో ఫ్రాన్స్‌లో వచ్చింది. వారి మార్గదర్శకత్వం, సహాయం అంతా ఈ విప్లవానికి లభించింది. ఈ విప్లవంనుండి వారు గుణపాఠాలు తీశారు; భవిష్యత్ విప్లవాలను గైడ్ చేశారు. మార్క్స్ పారిస్ కమ్యూన్‌యొక్క ప్రాముఖ్యతను ఎత్తిచూపాడు. దానితోపాటు, భవిష్యత్తులో సమగ్రంగా, విజయవంతంగా విప్లవాలను నడిపించాలంటే ఎలాంటి బలహీనతలను, కొరవలని నివారించాల్సి వుంటుందో కూడా ఎత్తి చూపాడు. పారిస్ కమ్యూన్ అనుభవాల ఆధారంగా మార్క్స్ రాజ్యంపట్ల, శ్రామికవర్గ విప్లవంపట్ల తన అభిప్రాయాలను మరింత వివరించాడు.

పారిస్ కమ్యూన్‌కు 46 సంవత్సరాల తర్వాత 1917 అక్టోబరు విప్లవం వచ్చింది. ఇది నిజంగా పెద్ద వ్యవధి. ప్రపంచం పెద్ద మార్పులకు లోనైంది. కొన్ని దేశాల్లో పెట్టుబడిదారీ విధానం వనరులపైనా, మార్కెట్లపైనా ఆధిపత్యం సంపాదించే తీవ్ర ప్రయత్నంలో 1900 నాటికి సామ్రాజ్యవాద స్వభావాన్ని సంతరించుకొన్నది. రష్యా శ్రామికవర్గం ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవాలకోసం సన్నాహాలు చేస్తున్న సమయంలో సామ్రాజ్యవాద దేశాలు తమ సంక్షోభాలను, వైరుధ్యాలను బయటపెట్టుకొంటూ వచ్చాయి. అవి బాహాటంగా చీలిపోయి, ప్రపంచాన్ని తమ మధ్య విభజించుకొనడానికిగాను యుద్ధానికి (మొదటి ప్రపంచయుద్ధం: 1914–18) తలపడ్డాయి. రష్యా విప్లవానికి లెనిన్ మార్గదర్శకత్వం, నాయకత్వం లభించాయి. లెనిన్ మార్క్సిజాన్ని, పారిస్ కమ్యూన్ అనుభవాలను, యితర విప్లవాల అనుభవాలను రష్యా నిర్దిష్ట పరిస్థితులకు అద్భుతంగా అన్వయించాడు. విప్లవానికి విజయవంతంగా మార్గదర్శకత్వం అందించాడు.

రష్యాలో జరిగిన 1917 విప్లవం ప్రపంచంలో కమ్యూనిస్టు, విప్లవోద్యమాలకు గొప్ప వూపునిచ్చింది. అవి పరుగుపరుగున పురోగమించాయి. 1917–56 మధ్యన నాల్గు దశాబ్దాల కాలంలో సోవియట్ యూనియన్ ప్రపంచ పరిణామాలను గొప్పగా

ప్రభావితం చేయగల, పలుకుబడిగల బృహత్తర సోషలిస్టు వ్యవస్థగా పరిఢవిల్లింది. కమ్యూనిస్టు పార్టీ, స్టాలిన్ నాయకత్వాన సోషలిస్టు సోవియట్ యూనియన్ ప్రపంచంలోని వివిధ దేశాలలో సామ్రాజ్యవాదుల, దోపిడీవ్యవస్థల కాడిని వదిలించు కొనడానికి పోరాటం సాగిస్తున్న కార్మికవర్గానికి, పీడిత జాతులకు, ప్రజలకు అత్యంత విశ్వసనీయమైన, శక్తివంతమైన రక్షణ దుర్గంగా ముందుకు వచ్చింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్న ప్రజాతంత్ర, జాతీయ, సోషలిస్టు, శాంతిశక్తులకు ముందు పీఠిన నిలిచింది. ఫాసిజానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అత్యున్నత త్యాగాలు చేసింది. ఫాసిజాన్ని ఓడించడంలో, సామ్రాజ్యవాదంపై అత్యంత బలమైన దెబ్బలు తీయడంలో ప్రధానపాత్ర వహించింది.

సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ నాయకత్వాన ఆధునిక రివిజనిస్టులు నాయకత్వాన్ని, అధికారాన్ని హస్తగతం చేసుకొనడం, సోవియట్ యూనియన్ సోషల్ సామ్రాజ్యవాదంగా దిగజారడం, సోవియట్ యూనియన్ విడిపోవడంతో ముగియడం నిస్సందేహంగా కమ్యూనిస్టు, విప్లవోద్యమాలకు తీవ్రమైన ఎదురుదెబ్బ, ఈ ఎదురుదెబ్బ ప్రభావాల నుండి యింకా తేరుకొనకముందే 1978లో చైనా తీవ్రమైన తిరోగమనానికి గురైంది. ఈ ఎదురుదెబ్బలు, తిరోగమనాలు మన విప్లవ మార్గంలో మరిన్ని యిబ్బందులను, అవరోధాలను సృష్టించాయి. ఐతే, యివి మార్క్సిజం – లెనినిజం విప్లవ సూత్రాలను త్రోసిపుచ్చవు. ఈ విప్లవాల ప్రాముఖ్యతను తుడిచిపెట్టవు. రష్యా శ్రామికవర్గం పారిస్ కమ్యూన్, 1905 విప్లవ అనుభవాలను అక్టోబరు విప్లవాన్ని విజయవంతం చేయడానికి సోపానాలుగా ఉపయోగించినట్లుగానే ఈనాటి శ్రామికవర్గ విప్లవకారులు కూడా రష్యా శ్రామికవర్గ సుసంపన్నమైన అనుభవాలను విప్లవాల పురోగమనం కోసం ఒక భూమికగా వినియోగించు కోవాలి.

“ఇది విపరీతమైంది, కాని నిజం. మన విప్లవం అదృష్టమైన క్షణంలో బ్రద్దలైంది” – లెనిన్ అన్నమాటలివి. రష్యావిప్లవం అంతర్జాతీయ సామ్రాజ్యవాదం ఎదురుదెబ్బకు గురైన అనుకూల పరిస్థితిని మాత్రమే వినియోగించుకొన్నది అని ఆయన వివరించాడు. ఆయన యిలా చెప్పాడు : “తన చక్రాలక్రింద మనల్ని నొక్కి, ముక్కచెక్కలుగా ధ్వంసం చేయాల్సిన రైలుబండి యింజను తాత్కాలికంగా ఆగిపోయింది. దురాక్రమణదారులైన రెండు గ్రూపులు ఘర్షణకు దిగడంవల్ల యింజను ఆగిపోయింది”. మరొకచోట లెనిన్ యిలా చెప్పాడు. “విప్లవంద్వారా కూలద్రోయబడాల్సిన బూర్జువావర్గం రష్యాలో రాజకీయంగా అనుభవరహితంగా, ఆర్థికంగా బలహీనంగా, నిర్మాణరీత్యా అధ్వాన్న స్థితిలో వుండడంవల్ల రష్యా విప్లవానికి సాపేక్షికంగా బలహీనమైన శత్రువు తటస్థించాడు”. ఇక్కడ లెనిన్ చెప్పదలుచుకొన్నదొకటే. 1917లో రష్యా విప్లవానికి భౌతికంగా అనుకూలమైన అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులున్నాయి.

ఐతే, రష్యా ప్రజలకు బాగా అమర్చిన పళ్లెంలో విప్లవం వడ్డించబడిందని చెప్పడం లెనిన్ ఉద్దేశం కాదు. లెనిన్ స్వయంగా యిలా చెప్పాడు : “నమ్మశక్యంకాని కష్టాలు, కడగండ్ల మూల్యాన్ని, తీవ్రమైన తిరోగమనాల పరంపరలు, మన పొరపాట్లతో కూడిన అసాధారణ బాధల మూల్యాన్ని చెల్లించి రష్యా ప్రజలు విప్లవంలో విజయం సాధించారు”. అందువల్ల ఒక విప్లవానికి అనుకూలమైన భౌతిక పరిస్థితులు అవసరం, కీలకం కూడా. కాని అవి మాత్రమే విప్లవాన్ని తీసుకొని రావు. సరైన స్వీయాత్మక శక్తులు లేకుండా, అనుకూలమైన భౌతిక పరిస్థితులను విప్లవంకోసం సరిగా వినియోగించు కొనకుండా శ్రామికవర్గం సామ్రాజ్యవాదులమధ్య, శత్రువర్గాలమధ్య వున్న వైరుధ్యాలను, సంక్షోభాలను, సంఘర్షణలను వినియోగించుకోలేదు. భౌతిక పరిస్థితులను విప్లవ విజయంగా మార్చలేదు. రష్యా విప్లవ క్రమం దీన్నే చూపెడుతుంది.

అక్టోబరు విప్లవ విజయాన్ని సాధ్యంచేసిన పరిస్థితులను లెనిన్ యిలా ఎత్తిచూపాడు :

1. అత్యంత శాస్త్రీయమైన, విప్లవాత్మకమైన సిద్ధాంతం–మార్క్సిజం, రష్యా విప్లవంయొక్క నిర్దిష్ట పరిస్థితులకు, ఆచరణకు అన్వయించిన విప్లవపంథా ఈ విప్లవానికి మార్గదర్శకత్వం అందించింది. సరిగా నిర్వచించబడిన విప్లవదశలకు, కర్తవ్యాలకు అనుగుణంగా యిది అభివృద్ధి చెందింది. కార్మికవర్గ నాయకత్వాన, కార్మిక–కర్షక ఐక్యత పునాదిపై విప్లవ వర్గాలను ఐక్యపరిచిన విప్లవ వ్యూహం – ఎత్తుగడలను అనుసరించింది.

2. అసంఖ్యాక వర్గపోరాటాల క్రమంలో, రాజకీయ పోరాటాల క్రమంలో, రెండు విప్లవాల క్రమంలో పరీక్షించబడి, రాటుదేలిన బోల్షివిక్ పార్టీ దీనికి నాయకత్వం వహించింది. అక్టోబరు విప్లవ సమయానికి అత్యంత సమర్ధవంతమైన, బాగా గుర్తింపుపొందిన, మొత్తం ప్రజల నాయకుడుగా ముందుకు వచ్చిన పార్టీ యిది.

3. ఈ పార్టీ “శాంతికోసం జరిగే సాధారణ ప్రజాతంత్ర వుద్యమమూ, ఎస్టేటు భూములను స్వాధీనం చేసుకొనడానికి రైతాంగం సాగించే ప్రజాతంత్ర వుద్యమమూ, జాతుల స్వాతంత్ర్యం, సమానత్వంకోసం పీడిత జాతులు సాగించే వుద్యమమూ, బూర్జువావర్గాన్ని కూలద్రోసి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించడానికి శ్రామికవర్గం సాగించే సోషలిస్టు ఉద్యమమూ – ఇలాంటి విభిన్న విప్లవోద్యమాలనన్నింటినీ ఒకే విప్లవ ప్రవాహంగా అత్యంత నైపుణ్యంతో సమన్వయపరచగల్గింది. తన ఆశయ సాధనకోసం వెళ్లేదారిలో ప్రవాహంలో మునిగివున్న కొండలను తాకకుండా జాగ్రత్తగా, సమర్థవంతంగా పడవను నడపగలిగింది”. (బోల్షివిక్ పార్టీ చరిత్ర...)

4. 1900–1917 కాలమంతటా బోల్షివిక్కులు ఒకవైపున శత్రువర్గాల అభివృద్ధినిరోధక, విప్లవ ప్రతీఘాతక భావాలకు, చర్యలకు వ్యతిరేకంగా ఎడతెగని, రాజీలేని పోరాటం సాగించారు. అదే సమయంలో, కమ్యూనిస్టు, విప్లవోద్యమాలలో తలెత్తిన తప్పుడు ధోరణులకు, విప్లవోద్యమాన్ని నీరుగార్చడానికి, పెడమార్గం పట్టించడానికి, విచ్చిన్నంచేయడానికి ప్రయత్నించిన శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. విప్లవ కార్యాచరణతో జోడించబడిన ఇలాంటి సిద్ధాంత పోరాటం, రాజకీయ పోరాటం లేకపోతే రష్యాలో విప్లవ విజయం ఊహించలేనిది.

విప్లవంఅంటే గుప్పెడు పెటీబూర్జువా వ్యక్తులు, తమకు తాము విముక్తి ప్రదాతలుగా ప్రకటించు కొన్నవారు జరిపే కొన్ని వీరోచిత, దుస్సాహసిక, అద్భుత విన్యాసాలు, చర్యలుగానీ, కొన్ని సెక్షన్ల ప్రజల మధ్య ఉన్నత ఆదర్శాల ప్రచారం మాత్రమేకాదని లెనిన్ మనకు బోధించాడు. రష్యా ప్రధానంగా పెటీ బూర్జువా సమాజం కావడంవల్ల ఈ సమాజం అన్నిరకాల పెటీ బూర్జువా భావాలకు, ధోరణులకు సారవంతమైన నేలను సమకూర్చింది. అందువల్ల లెనిన్ తన శక్తులలో గణనీయ భాగాన్ని ఈ భావాలకు, ధోరణులకు వ్యతిరేకంగా సాగించే పోరాటంలో ఖర్చుచేయాల్సి వచ్చింది. ఈ భావాలు, ధోరణులు విభిన్నరూపాల్లో వ్యక్తమయ్యాయి. ఇవి తమ సంస్కరణవాద, రాజీవాద, అవకాశవాద విధానాలద్వారా విప్లవం నుండి విప్లవ సారాన్ని తొలిచివేయడానికి ప్రయత్నించాయి లేదా తమ అరాచకవాద, దుస్సాహసికవాద విధానాలద్వారా విప్లవాన్ని తుడిచి వేయడానికి (liquidate), శ్రామిక వర్గాన్ని ప్రజలకు దూరంచేయడానికి ప్రయత్నించాయి.

ఒకానొక సామాజిక వ్యవస్థలో – ఒక నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలకూ – ఉత్పత్తి శక్తులకూ మధ్య వైరుధ్యం తీవ్రతరం ఐనప్పుడు, అప్పటి ఉత్పత్తి సంబంధాలను తగినట్లుగా మౌలికంగా మార్చకుండా ఉత్పత్తిశక్తుల అభివృద్ధి అసాధ్యమైనప్పుడు సమాజంలో మౌలిక మార్పుకు పరిస్థితి పరిపక్వం అవుతుందని మార్క్స్ మనకు బోధించాడు. అన్ని సందర్భాలలోనూ పురోగామి ఉత్పత్తిశక్తి లేదా వర్గం ఈ మౌలిక మార్పుకోసం సాగే పోరాటానికి నాయకత్వం వహిస్తుంది. పురోగామిశీలమైన వర్గం యొక్క ఆకాంక్షలకు సరిగా స్పందించగల, ఆ వర్గ ప్రయోజనాలకు సరిగా ప్రాతినిధ్యం వహించి, పోరాటానికి తుదికంటా నాయకత్వం అందించగల సిద్ధాంత, రాజకీయ శక్తి మాత్రమే తన చారిత్రక పాత్ర నిర్వహించగల్గుతుంది. సిద్ధాంత, రాజకీయ నాయకత్వం జనాన్ని పక్కకునెట్టడానికి, జనంపై స్వారీచేయడానికి, తమ కోర్కెలను, చర్యలను వారిపై రద్దుడానికి, 'విముక్తి ప్రదాతలు'గా వ్యవహరించడానికి ఎలాంటి ప్రయత్నం చేసినా ఆ నాయకత్వం తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని, నాయకత్వం వహిస్తున్నానని చెప్పుకొంటున్న వర్గం నుండి, జనం నుండి వేరుపడిపోక తప్పదు. విఫలంకాక తప్పదు.

బూర్జువావర్గం ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని వదిలి వేసుకొని, సామ్రాజ్యవాదంతో రాజీపడిన నాటినుండీ ఈ విప్లవ నాయకత్వ బాధ్యత శ్రామికవర్గం యొక్క భుజాలపై పడింది. శ్రామికవర్గం ప్రజాతంత్రవర్గాలను, ప్రత్యేకించి, రైతాంగాన్ని వ్యవసాయవిప్లవంలోకి సమీకరించి, కార్మిక–కర్షక మైత్రి పునాదిగా విప్లవ ఐక్యసంఘటన నిర్మించి, విప్లవానికి తుదికంటా నాయకత్వం అందించినప్పుడే తన ప్రయత్నంలో విజయం సాధించగలిగింది. కనుక శ్రామికవర్గ నాయకత్వాన సాగే విప్లవంలోని అన్నిరకాల కార్యకలాపాల్లో ప్రజాతంత్ర వర్గాలు చైతన్యయుతంగా, నిర్మాణయుతంగా, ప్రత్యక్షంగా పాల్గొనకుండా ప్రజాతంత్ర విప్లవం గురించి వూహించలేము.

లెనిన్ యిలా చెప్పాడు : "ప్రజలను నిజమైన విజ్ఞానవంతంచేయడాన్ని వారి స్వతంత్ర రాజకీయ పోరాటంనుండి, ప్రత్యేకించి, విప్లవపోరాటంనుండి ఎప్పుడూ వేరుచేయలేము. దోపిడీకి గురవుతున్న వర్గాన్ని పోరాటం మాత్రమే విజ్ఞానవంతం చేయగలదు. పోరాటం మాత్రమే దాని స్వీయశక్తి యొక్క పరిమాణాన్ని బయటపెడ్తుంది; దాని దృక్పథాలన్ని విశాలంచేస్తుంది. మెదడులో స్పష్టతను తెస్తుంది, సంకల్పాన్ని ఏర్పరుస్తుంది".

రష్యావిప్లవం గురించి, ప్రత్యేకించి 1905 విప్లవం గురించి తెలిసిన వారికి కార్మికవర్గం, రైతాంగం ఈ విప్లవంలో ఎలాంటి అద్భుతపాత్ర నిర్వహించారో తెల్సినదే. అదే సమయంలో, ఈ విప్లవం ఓటమి నెదుర్కొన్నది. దీనికి కారణాలను విశ్లేషించిన లెనిన్ ఆ సమయంలో రైతాంగం ఇంకా చెదిరిపోయిన, అసంఘటిత స్థితిలో వుందనీ, బూర్జువావర్గం పట్ల, జారుపట్ల భ్రమల్లో మునిగివుందనీ, జారును కూలద్రోయడానికి జరిగే పోరాటంలో కార్మికవర్గాన్ని అనుసరించడానికి పూర్తిగా సిద్ధంగాలేదనీ ఆయన ఎత్తిచూపాడు. 1905 విప్లవ ఓటమికి ఇదొక ముఖ్యకారణం. అదే సమయంలో 1905 విప్లవం ఓటమి నెదుర్కొందంటే దానర్థం ఆ విప్లవ కర్తవ్యాలు "తప్పు" అనీ, దాని తక్షణ లక్ష్యం "ఊహాజనితం" అనీ, ఈ విప్లవంలో అనుసరించబడిన పద్ధతులు "పొరపాటు" అనీ కాదని లెనిన్ నొక్కి చెప్పాడు. "శక్తులు తగినంతగా సంసిద్ధంకాలేదనీ", "విప్లవ సంక్షోభం తగినంత విస్తృతంగా, లోతుగాలేదనీ" ఈ ఓటమి సూచించింది. ఆయన ఇంకా ఇలా చెప్పాడు: "1905 విప్లవం నేలను లోతుగా దున్నింది. తరతరాల దురభిప్రాయాలను పెకిల్చివేసింది. లక్షలాది కార్మికులను, కోట్లాది రైతులను రాజకీయ జీవితంతో మేల్కొలిపింది. రష్యా సమాజంలోని వర్గాలన్నీ (ప్రధాన పార్టీలన్నీ) ఒకరికొకరు, ప్రపంచానికి నిజస్వభావంతో, తమ ప్రయోజనాలు, శక్తులు, చర్యలతీరు, తక్షణ, అంతిమ లక్ష్యాలతో నిజమైన కలయికను బయటపెట్టింది".

ఇక్కడ గమనించాల్సిన ప్రధాన విషయం ఏమంటే, విప్లవం అన్నది ఒక, విశాలమైన, సజీవమైన ప్రదర్శనశాల. ఇక్కడ ప్రజలే "నిజమైన పాత్రధారులు". లెనిన్ ఒకచోట పేర్కొనట్లుగా, ఈ పాత్రధారులు – లక్షల, కోట్ల సంఖ్యలో వున్న ప్రజలు – "పెద్ద, చిన్న రిహార్సల్స్‌లో", అంటే, అసంఖ్యాకమైన, వివిధ రూపాల్లో సాగే నిరసనలు, ఆందోళనలు, వర్గయుద్ధాలు, రాజకీయ పోరాటాల మధ్యన – సమర్థుడైన డైరెక్టరు(పార్టీ) మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతారు. ఉత్తమ నటులుగా తమ్ముతాము మలుచుకొంటారు. ఈ క్రమంలో వారు "ఒకరినొకరు, తమ పాత్రలు, తమ స్థానాలు, తమ అమరిక గురించి ప్రతి వివరంతో సమగ్రాతి సమగ్రంగా, ప్రతి చిన్న, పెద్ద రాజకీయ ధోరణియొక్క స్వరూపం, నటుడి తీరు దాకా తెలుసుకొంటారు". విజయవంతంగా తమ పాత్రలను "పోషిస్తారు".

అందువల్ల, దోపిడీ, పీడనలకు గురవుతున్న ప్రజలు స్వీయ ఆచరణద్వారా నేర్చుకొనడానికి, విజ్ఞానవంతం కావడానికి, భ్రమలను అధిగమించడానికి, రాటుదేలడానికి, తమ పోరాటం, నిర్మాణం యొక్క శక్తిపట్ల విశ్వాసం పెంచు కొనడానికి, పోరాట

ఆవశ్యకతపట్ల, సవ్యతపట్ల నమ్మకం ఏర్పరచుకొనడానికి అవకాశాన్ని నిరాకరించడానికి, ఆ అవకాశం లేకుండా చేయడానికి, లాగివేసుకొనడానికి చేసే ప్రయత్నం ఏదైనా అది విప్లవానికే హాని కలిగిస్తుంది.

లెనిన్ కోట్లాది ప్రజలు సాగించిన వర్గ యుద్ధాల మధ్యన, తీవ్రమైన సిద్ధాంత, రాజకీయ యుద్ధాల మధ్యన ఇటుకకు ఇటుకను పేర్చి శ్రామికవర్గ పార్టీని నిర్మించాడు. అక్టోబరు విప్లవానికి విజయవంతంగా నాయకత్వం వహించగల పరిణతి, శక్తి, సామర్థ్యంగల పార్టీగా అభివృద్ధి చెందేలా గైడ్ చేశాడు. విప్లవం ఎదుర్కొనే ఎగుడు దిగుళ్లను, మలుపులను, ప్రజల చైతన్యంలో వచ్చే మార్పులను గమనంలోకి తీసుకోవాలని బోల్షివిక్కులకు అన్నివేళలా ఎత్తిచూపాడు. విప్లవశక్తులు – విప్లవ ప్రతీఘాతశక్తుల బలాబలాల్లో వచ్చే మార్పులను వాస్తవికంగా బేరీజు వేయాలని, పరిస్థితిని విప్లవానికి అనుకూలంగా మలచుకొనడానికి అనుగుణ్యమైన ఎత్తుగడలను అనుసరించాలని ఆయన చెప్పాడు.

1905 విప్లవ ఓటమిని వాస్తవికంగా అంచనా వేసినందువల్లనే 1917 అక్టోబరు విప్లవానికి ప్రజలను సిద్ధంచేయడానికిగాను లెనిన్ ఒక దశాబ్దానికిపైగా సమయం, చుట్టిన (circuitous) క్రమం తీసుకొనేలా రష్యా విప్లవాన్ని గైడ్‌చేశాడు. 1905 ఆరంభంలో కార్మికులు పెద్దసంఖ్యలో ఇంకా చట్టపరమైన భ్రమల్లో వుండడాన్ని, ఈ స్థితిని పోలీసు ఏజెంట్ గోపన్ కార్మికులను "జారు ప్రభువు" పాదాల వద్ద మోకరిల్లేలా చేయడానికి వినియోగించుకో గలుగుతున్నాడని బోల్షివిక్కులు గమనించారు. అందువల్ల, ఈ పరిస్థితికి సరిపడిన ఎత్తుగడలను అనుసరించాలని లెనిన్ మార్గదర్శకత్వంలో వారు నిర్ణయించుకొన్నారు. జనవరి 9, 1905 రోజున జారు తెల్లసౌధానికి బయలుదేరే కార్మిక ప్రదర్శనలో చేరడానికి వారు సందేహించలేదు. ఆ విధంగా ఈ ప్రదర్శనను లక్షలాది కార్మికులు వారి కుటుంబాలు లీగల్ భ్రమలనుండి బయటపడి, విప్లవమార్గం చేపట్టడానికి తోడ్పడే బహిరంగ పాఠశాలగా ఉపయోగించాలని భావించారు. జనవరి 9, 1905 నాడు 1,40,000 కార్మికులు – వారి కుటుంబాలు – భార్యలు, పిల్లలు, వృద్ధులతో సహా జారు తెల్ల సౌధానికి ప్రదర్శనగా బయలుదేరారు. కాని వారిపై తుపాకీ గుళ్లవర్షం కురిపించబడింది. 1000మంది కార్మికులు నేల కొరిగారు. 2000కు పైగా గాయపడ్డారు. కొన్ని డజన్ల బోల్షివిక్కులు చనిపోయారు. నిస్సందేహంగా, కార్మికులు ఈ సందర్భంగా భారీ మూల్యమే చెల్లించారు. ఐతే, ఈ అనుభవం లక్షలాది కార్మికులు భ్రమలనుండి బయటపడడానికి తోడ్పడింది. ఆరోజు సాయంత్రానికి కార్మికులు కార్మిక జిల్లాల్లో బారికేడ్లు నిర్మించారు. అనేక నగరాల్లో కార్మికుల, సైనికుల, నావికుల నిరసనలు, తిరుగుబాట్లు వ్యాపించాయి. ఆ విధంగా 1905 విప్లవం ఆరంభమైంది. సర్వత్రా "నిరంకుశత్వం నశించాలి" అన్న నినాదం మార్మోగింది. ఇక్కడ గమనించాల్సింది, లెనిన్, బోల్షివిక్కులు ఒక విప్లవ కార్యాచరణను కార్మికులపై రుద్దలేదు. విప్లవ చర్య యొక్క సవ్యతను గుర్తించడానికి కొంత సమయం, ప్రత్యక్షానుభవం అవసరమైన స్థితిలో కార్మికు లున్నప్పుడు బోల్షివిక్కులు వారిని వారి మానాన వారిని వదిలివేసి, తమ దారిన తాము పోలేదు. వారికి సహాయపడ్డారు.

1917 అక్టోబరు విప్లవానికి కొద్దినెలల ముందు కూడా బోల్షివిక్కులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. అది బోల్షివిక్ పార్టీ ప్రజలను విప్లవ వెల్లువకు, జారిస్టు నియంతృత్వానికి వ్యతిరేకంగా అంతిమ విప్లవదాడికి సన్నద్ధం చేస్తున్న సమయం. ఐతే, ఇదే సమయంలో బూర్జువావర్గం రాజభవనంలో తిరుగుబాటుద్వారా అధికారం చేజిక్కించుకొని జారును కాపాడడంలో తాత్కాలికంగా సఫలమైంది. పెల్లుబుకుతున్న విప్లవ వెల్లువపై నీళ్లు చల్లడానికి, రష్యా ప్రజల అభీష్టానికి భిన్నంగా ఫ్రెంచి, బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కుమ్మక్కై దురాక్రమణ యుద్ధం కొనసాగించడానికే బూర్జువావర్గం ఈ చర్యకు పాల్పడింది. మరోవైపున, ఆ సమయంలో బోల్షివిక్కులు ఎదుర్కొంటున్న అననుకూలతలను, యిబ్బందులను వినియోగించుకొని విప్లవ ఫలాలను దొంగలించే పనిలో మెన్షివిక్కులు మునిగి వున్నారు. వారు ఆ సమయంలో ఏర్పడిన సోవియట్లలో మెజారిటీ సోవియట్లపై తమ నాయకత్వం నెలకొల్పుకోగలిగారు. సోషలిస్టు విప్లవాన్ని నిరోధించడానికి తమ స్థానాలను ఉపయోగించారు. బూర్జువా వర్గంతో, దాని నాయకత్వాన వున్న తాత్కాలిక (provisional) ప్రభుత్వంతో రాజీబేరాలు సాగించడానికి ఉపయోగించారు. ఆ సమయంలో బోల్షివిక్కులు ప్రజలపై సంపూర్ణంగా నాయకత్వం నెరపగల స్థితిలో ఇంకా లేరని ఈ పరిస్థితి తెలియ జేస్తుంది. కార్మికుల్లోని పెటీ బూర్జువా సెక్షన్ల మధ్య మెన్షివిక్కుల, సోషలిస్టు విప్లవకారుల పలుకుబడి, సమర్ధన బలంగా వున్నాయి. బూర్జువా వర్గానికి రాజ్యాధికారాన్ని అప్పగించే మెన్షివిక్కుల పంథాకు ఈ సెక్షన్లు ఆమోదం తెలిపాయి. అలా చేస్తే బూర్జువా రాజ్యం సోవియట్ల పనికి అడ్డురాదని వారు నమ్మారు. ఈ పరిస్థితిలో బూర్జువావర్గ ప్రభుత్వ స్వభావాన్ని, మెన్షివిక్కుల ద్రోహాన్ని స్పష్టంగా చూపేలా కార్మిక వర్గానికి, ప్రజలకు తోడ్పడాలని, దీనికోసం వేచి వుంటూ, వారికి ఓపిగ్గా వివరించాలని, విద్యావంతం చేయాలని బోల్షివిక్‌పార్టీ నిర్ణయించుకోవాల్సివచ్చింది. బూర్జువావర్గ అధికారాన్ని కూలద్రోయండి, మెన్షివిక్కులను సోవియట్ల నాయకత్వం నుండి తొలగించండి లాంటి అపరిపక్వ పిలుపులకు పూనుకోలేదు. ఉక్కు తగినంతగా వేడిగా వుందని సంతృప్తి చెందిన తర్వాతే దానిపై వేటు వేయాలని నిర్ణయించింది. ఒకటిరెండు నెలల్లోపలే బోల్షివిక్ పార్టీ మొత్తం ప్రజలపైన తన నాయకత్వాన్ని సంపూర్ణంగా, దృఢంగా నెలకొల్పు కొన్నది. విప్లవ ప్రజావెల్లువకు నాయకత్వం వహించి, అంతిమంగా బూర్జువా వర్గాన్ని దాని అనుచరులతో సహా అధికారం నుండి కూలద్రోసింది. రష్యావిప్లవాన్ని విజయ శిఖరానికి చేర్చింది.

బోల్షివిక్ పార్టీ ఏనాడూ విప్లవాన్ని కొద్దిమంది అగ్రగామి శక్తులకు మాత్రమే సంబంధించిన వ్యవహారంగా చూడలేదు. అందుకే, ఇలాంటి ఎత్తుగడలను అనుసరించింది. బోల్షివిక్కుల దృష్టిలో విప్లవం అన్నది ఆర్థిక, రాజకీయ వ్యవస్థను మౌలికంగా మార్చడానికి కోట్లాది పీడిత, తాడిత ప్రజలు సాగించే విప్లవకార్యాచరణ ఫలితం. కనుకనే ఆయా నిర్దిష్ట పరిస్థితులలో ప్రజలను సన్నద్ధం చేయడానికి వారిలో గర్భితమైవున్న విప్లవ శక్తుల నన్నింటినీ వెలికితీసి, పూర్తి వినియోగంలోకి తేవడానికి

ఉపయోగపడతాయనుకొన్న ఎత్తుగడలను అది అనుసరించింది. పోరాట రూపాలు, నిర్మాణ రూపాల విషయంలో పార్టీ జంకుగొంకులతో, అపోహలతో, ముందుగా ఏర్పరచుకొన్న అభిప్రాయాలతో వ్యవహరించలేదు.

గొప్ప విప్లవాలు (రష్యా, చైనా) తీవ్రమైన ఎదురుదెబ్బలను చవిచూశాయి. దీనిలో సందేహం లేదు. కాని అవి విజయవంతమైన విప్లవాలు అన్న చారిత్రక సత్యాన్ని తుడిచిపెట్టలేవు. నిజమే; ఇవి వేరు వేరు విప్లవ పంథాలను అనుసరించాయి. ఐనప్పటికీ, వీటికి నిర్వివాదంగా ఒక సామాన్యాంశం వుంది. ఈ విప్లవాలు శ్రామికవర్గ నాయకత్వాన సాగాయి. విప్లవ వర్గాలను ఐక్యంచేశాయి; కార్మిక – కర్షక మైత్రిని సాధించాయి. ఆరంభంనుండీ – తుది దాకా నిజమైన అర్థంలో ఇవి ప్రజా విప్లవాలు. ప్రజలు, దోపిడీ పీడనలకు గురవుతున్న కోట్లాది ప్రజల చైతన్యవంతమైన, సంఘటితమైన ప్రజల విప్లవ కార్యాచరణ మాత్రమే విప్లవాన్ని విజయం దాకా తీసుకెళ్లిందని ఈ విప్లవాలు బలంగా, రూఢిగా ఆచరణలో నిరూపించాయి. విప్లవంలో ప్రజలే నిజమైన పాత్రధారులు, నిజమైన చోదకశక్తులు. ఈ విప్లవ ప్రజాపంథా మార్గదర్శకత్వం వల్లనే పార్టీ విప్లవాలను విజయంవైపున నడిపించగలిగింది. మితవాదంవైపు లేదా అతివాదం వైపు మళ్లించడానికో, విప్లవ ప్రజాపంథానుండి పట్టాలు తప్పించడానికో ప్రయత్నించిన ధోరణులు, ఆచరణలకు వ్యతిరేకంగా పోరాటం సాగించింది. విప్లవాలను కాపాడుకొన్నది. పార్టీ విప్లవంలో ప్రజల పాత్రను తగ్గించినా, నిరాకరించినా విప్లవాలు పురోగమించలేవు.

గొప్ప విప్లవాలు ఎదురుదెబ్బలకు గురికావడం – విప్లవాలకు మరిన్ని అవరోధాలు, యిబ్బందులు కల్పించడానికి, తమ వ్యవస్థలచుట్టూ మరిన్ని రక్షణ గోడలను నిర్మించుకొనడానికి దోపిడీ వర్గాలకు, సామ్రాజ్యవాదులకు తగినంత సమయాన్ని, అవకాశాన్ని అందించింది. ఐతే, ఈ దోపిడీ వ్యవస్థల మౌలిక స్వభావాలు మారడంగానీ, దోపిడీ పీడనల తీవ్రత, క్రూరత్వం తగ్గడంగానీ జరగలేదనేది తిరుగులేని వాస్తవం. ఈ కారణంగా సమాజంలో మౌలిక మార్పులకోసం సాగాల్సిన విప్లవాలు అవసరంలేకుండా పోలేదు; వాటికి కాలదోషం పట్టలేదు. ఇబ్బందులు, అవరోధాలు, నూతన సమస్యలు సూచించేదొక్కటే. మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనావిధానం వెలుగులో నిర్దిష్ట పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మన విప్లవపంథాను నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి, అవరోధాలను, యిబ్బందులను, సమస్యలను అధిగమించడానికి, పరిస్థితులను విప్లవానికి అనుకూలంగా మలుచుకొనడానికి తోడ్పడే ఎత్తుగడలను అనుసరించాలి. విప్లవం పేరిట నిరాశతో కూడిన సాహసం, తలను గోడకు గుద్దుకొనడం లేదా హింసావాద కుస్తీలు, అవకాశ వాదంతో గాలివాటున పయనించడంలాంటి చర్యలకు పాల్పడడం దేనికీ వుపయోగపడవు. పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, పెరిగిన ఇబ్బందులు సైతం విప్లవ ప్రజాపంథా నేడు అనివార్యంగా ఆచరించితీరవలసిన సరైన పంథా అనీ తెల్పుతాయి. అక్టోబరు విప్లవం నుండి నేర్చుకొంటూ ముందుకు సాగుదాం.

ooooo